بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ    نَحْمَدُهٗ وَنُصَلِّى عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ    وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

## Summary of Friday Sermon Huzur-e-Anwar 24.06.2016 (Telugu)

**రమజాన్‌లో అల్లాహ్ తఆలా నిష్టాపరత అవలంభించాలని, అతని సామీప్యము మనకు కలగాలని, తన దుఆలు ఆమోదించబడినట్లు మనము చూడాలని మనము ఆశించినప్పుడు ఆయా దుష్కార్యముల నుండి దూరముండుచు అల్లాహ్ తఆలా ఆదేశములను పాటించుటకు మనము చాలా కృషి చేయవలసిన అవసరమున్నది.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 24.06.2016 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

దుఆల ఆమోదము కొరకు అల్లాహ్ తఆలాపై సంపూర్ణ నమ్మకము, అతన్ని సర్వ శక్తులకు అధికారిగా భావించుచు అతనితో యాచించుట, అతని ఆదేశములను పాటించుట అనివార్యమని గత ఖుత్బాలో ప్రస్తావించబడెను. అల్లాహ్ తఆలా ఆదేశములేమిటి ? ఇందుకు పవిత్ర ఖుర్ఆన్ లాంటి గొప్ప గ్రంథము ప్రసాధించబడెను. ఇందులో అల్లాహ్ తఆలా సమస్త ఆదేశములు అనగా చేయవలసినవి, చేయకూడనివి యున్నాయి. فَلْيَسْتَجِيْبُوْا لِيْ నా దాసులు నా ఆదేశమును స్వీకరించవలెను, పవిత్ర ఖుర్ఆన్‌లో గల ఆదేశములను స్వీకరించవలెనని అల్లాహ్ తఆలా అనెను. తద్వారా అల్లాహ్ తఆలా దుఆలను కూడ ఆమోదించును, వివేకము కూడ లభించును.

అల్లాహ్ తఆలా ఇచ్చిన మంచి, చెడు ఆదేశములు పవిత్ర ఖుర్ఆన్‌లో చాలా యున్నాయి. వాటిని మనము అప్పుడప్పుడు గుర్తు చేసుకోవలెను, స్మరించుకోవలెను. కొన్ని ఆదేశములను నేనిప్పుడు సేకరించినాను. అన్నిటి కంటే ప్రాథమిక ఆదేశము మానవ జన్మ ఉద్ధేశమైన అల్లాహ్ తఆలా ఆరాధన చేయునది. దీనిని అనుక్షణం మనము గుర్తంచుకోవలెను. అల్లాహ్ తఆలా وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْاِنْسَ اِلَّا لِيَعْبُدُوْنِ అని బోధించెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ సూక్తి అనువాదమిట్లు చేసిరి. నన్ను ఆరాధించుటకే నేను జిన్నాతులను, మానవులను పుట్టించితిని.

హుజూర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. ఈ అంశమును నేను చాలా సార్లు ప్రస్తావించినాను. పదే పదే ఇటు వైపు సూచించినాను. కాని మనలోని చాలా మంది కొన్ని రోజులు దీనిని గుర్తుంచుకొని అనంతరం మరచిపోతారు. తుదకు జీవిత సమర్పితులు, ధార్మిక విద్యావంతులు, విద్యా పరంగా దీని ప్రాముఖ్యత తెలిసినవారు కూడ ఇటువైపు తగిన రీతిలో శ్రద్ధ చూపరను విషయము నాకు తెలుసు, నేను చూచినాను కూడ. ఒకరి సమస్య ప్రవేశపెట్టినప్పుడు ఖుర్ఆన్, హదీస్ పరంగా నచ్చచెప్పుతారు, కాని కొందరికి ఈ ప్రాథమిక ఆదేశము పట్ల తగిన రీతిలో శ్రద్ధ లేదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక చోట ఇట్లనిరి.

అల్లాహ్ తఆలా మిమ్ములను పుట్టించు ఉద్ధేశమేమనగా మీరతన్ని ఆరాధించుచు అతని కొరకు అంకితము అగుట. ప్రపంచము మీ అసలు ఉద్ధేశము కాకూడదు. అందుకే పదే పదే నేనీ విషయమును ప్రస్తావించుచుందును. నా దృష్టిలో ఈ ఒక్క విషయము కొరకే మానవుడు వచ్చెను. కాని దీని నుండే అతడు దూరమున్నాడు. వారు అలైహిస్సలాం అనంతరం దీనిని మరింత వివరించిరి. ప్రపంచమును అసలు ఉద్ధేశము చేసుకోకపోవడం అనగా మీరు ప్రపంచ కార్యములను చేయకపోవడం కాదు. నిస్సందేహముగా వాటిని కూడ చేయుము. కాని ప్రార్థన బాధ్యతయే కాక జన్మ ఉద్ధేశమైనందున ప్రార్థనకు మీరు ప్రాధాన్యత ఇవ్వవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇప్పుడు రమజాన్‌లో ఈ ఆదేశమును దాదాపు పాటించుచున్నారు. కేవలం రమజాన్‌లోనే కాదు, రమజాన్‌లోనే అల్లాహ్ తఆలా సూచించిన పద్ధతిలో ప్రార్థనపై గట్టి శ్రద్ధ చూపించుటకు పూర్తి ప్రయత్నము చేయడం కాదు రమజాన్ శిక్షణ, వ్యాయామం ప్రార్థనల వైపు మనకు కలిగించిన శ్రద్ధను ఇక ముందు మనము శాశ్వతముగా జీవితములో భాగము చేసుకొనుటకు ప్రయత్నించవలెను. తమ ఆదర్శములను నెలకొల్పవలెను. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లనిరి.

అల్లాహ్ తఆలా దృష్టిలో మానవ జన్మ ముఖ్య ఉద్ధేశము ఆరాధన అయినప్పుడు మరొక వస్తువును ముఖ్య ఉద్ధేశముగా చేసుకొనుట విశ్వాసి స్థాయికి తగదు. మనసు హక్కులు ధర్మబద్ధమే. కాని మనసు వీపరీతములు

సమంజసము కాదు. మనసు హక్కులు కూడ అవి నిరుపయోగముగా మారకుండా యుండుటకే ధర్మబద్ధమైనవి. మీరు కూడ ఈ వస్తువులను ఇందు కొరకే ఉపయోగించుము. ఇవి మిమ్ములను ఆరాధనకు అర్హులుగా చేయుటకు వీటితో పని తీసుకోగలరు. కాని అవే మీ ముఖ్య ఉద్దేశమగుటకు కాదు.

మనసు హక్కులను చెల్లించు ప్రస్తావన హదీసులో కూడ గలదు. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మీ మనసు హక్కు కూడ మీపై గలదు. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నిస్సందేహముగా ఇది హక్కే. కాని ఇందులో హద్దులు దాటరాదు, మధ్యేమార్గముండవలెను. మనసు ధర్మబద్ధమైన హక్కులను చెల్లించుము. ఎందుకనగా ఈ హక్కులను అల్లాహ్ తఆలా మానవుని స్వభావములో పెట్టెను. కనుక ఎట్టి పరిస్థితిలోనైనా వాటిని చెల్లించుట తప్పనిసరి. వాటిని తమ లాభము, వినియోగములో వాడుకొనుము. వాస్తవానికి కొన్ని వస్తువులు ఎలా యున్నవనగా వాటిని వినియోగించనిచో, పూర్తి హక్కు చెల్లించనిచో అనగా మనసునకు సంబంధించినవి, అవి నిరుపయోగమై పోవును. మానవ జన్మ ఉద్దేశమైన ఆరాధనతో పాటు వాటిని వినియోగించుట కూడ అనివార్యము. అల్లాహ్ తఆలా సృష్టించిన విశిష్టతలు, శక్తులను వినియోగించుట తప్పనిసరి. వినియోగించకపోవడం అల్లాహ్ తఆలా కృతఘ్నత అగును. ఒక అనుచరురాలుండిరి. వారి స్థితి దీనముగా యుండెను. అలంకరించుకునేవారు కాదు, దువ్వేకునే వారు కాదు. ఇలా యుంటున్నారని ఎవరో వారి గురించి ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ప్రస్తావించిరి. వారు పిలిపించి (అడిగిరి). ఆమె ఇట్లనెను. ఎవరి కొరకు నేను అలంకరించుకోవలెను. నా భర్త పగలు కూడ ప్రార్థన చేయుచున్నాడు, రాత్రి కూడ ప్రార్థన చేయుచున్నాడు. వారు (సల్లం) భర్తను పలిపించి ఇట్లనిరి. నీ మనసు హక్కు కూడ నీపై గలదు. నీ భార్య హక్కు కూడ నీపై గలదు. అన్ని రకాల హక్కులను చెల్లించవలెను. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. అసందర్భముగా వాడినచో ధర్మబద్ధమైనది కూడ నిషేధితమగును. మానవుడు ఆరాధన కొరకు పుట్టించబడినాడని وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنْسَ إِلَّا لِيَعْبُدُونِ స్పష్టమగుచున్నది. ఈ ఉద్ధేశమును పూర్తి చేయుటకు అవసరమున్న దాని కంటే అధికముగా వినియోగించినచో అది ధర్మబద్ధమైనను వృధా అయినందున అతని కొరకు నిషేధితమగును. ప్రతి వస్తువు సక్రమ ఉపయోగము సమంజసమే. కాని అవసరాన్ని మించి ఉపయోగించినచో ధర్మ బద్ధమైన వస్తువు కూడ నిషేధితమగును. పగలు, రాత్రి మనసు అభిరుచులలో నిమగ్నమైన వ్యక్తి ప్రార్థన హక్కు ఎలా చెల్లించును. ఒక కఠిన జీవితము గడుపుట విశ్వాసికి అనివార్యము. కాని విలాసవంతమైన జీవితము గడిపినచో ఈ జీవితములోని పదవ వంతు కూడ పొందలేడు.

ప్రార్థన, ఆరాధన అంశమును అల్లాహ్ తఆలా ఇంకా చాలా చోట్ల ప్రస్తావించెను. అల్లాహ్ తఆలా ఇట్లనెను. رِجَالٌ لَّا تُلْهِيهِمْ تِجَارَةٌ وَّلَا بَيْعٌ عَنْ ذِكْرِ اللّٰهِ وَإِقَامِ الصَّلٰوةِ وَإِيْتَآءِ الزَّكٰوةِ يَخَافُوْنَ يَوْمًا تَتَقَلَّبُ فِيْهِ الْقُلُوْبُ وَالْأَبْصَارُ (నూర్ అధ్యాయము సూక్తి 78) అనగా ఒక వ్యాపారము, ఒక కొనుగోలు కార్యము అల్లాహ్ జపము నుండి గాని, ప్రార్థనాను స్థాపించుట నుండి గాని, దానముల (జకాత్) నుండి గాని, మైమరుపించని మహా పురుషులు, వారు హృదయములు, కనులు కూడ (భయము) తో తల క్రిందులగు దినము నుండి భయపడుదురు. ఈ సత్కారము అందరిని మించి ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులకు లభించినది. వారు అల్లాహ్ తఆలా ప్రీతులుగా మారిరి. వారు మార్గదర్శకులు, మీరు వారిని అనుసరించగలరని ఆయా అనుచరుల గురించి ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించిరి. హ్రజత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ సూక్తి వివరణలో ఇట్లనిరి. దైవ మిత్రుల ప్రస్తావనలో ఒక వ్యక్తి గురించి ఇట్లు వ్రాసియున్నది. ఒక వ్యక్తి వేలాది రూపాయల లావాదేవీలలో నిమగ్నమైయుండెను. ఒక దైవ మిత్రుడు అతన్ని చూసెను. సత్యస్వప్న చూపు అతనిపై వేసెను. ఇంతటి లావాదేవీల వలన కూడ అతని హృదయము అల్లాహ్ తఆలా స్మరణను విస్మరించలేదు. వారిట్లనిరి. ఇటువంటి వ్యక్తుల గురించే అల్లాహ్ తఆలా لَا تُلْهِيهِمْ تِجَارَةٌ وَّلَا بَيْعٌ عَنْ ذِكْرِ اللّٰهِ అనగా ఎటువంటి వ్యాపారము, కొనుగోలు వారిని విస్మరించేలా చేయలేదు. ప్రాపంచిక కార్యములలో కూడ నిమగ్నమగుచు దేవున్ని కూడ మరచిపోక పోవడమే మానవుని ప్రత్యేకత. భారము మీద పడునప్పుడు కూర్చొని, ఖాళీగా యున్నప్పుడు నడిచే వారి లాభమేమిటి.

ప్రాపంచిక పనులతో భయపడి మూలముకు కూర్చునే సన్యాసి బలహీనత చూపును. ఇస్లాంలో సన్యాసత్వము లేదు. భార్యలను, పిల్లలను వీడి, ప్రాపంచిక వ్యాపారములన్నిటిని వీడమని మేమెన్నడు చెప్పుము. కాదు. వాస్తవానికి ఉద్యోగి తన ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించవలెను, వ్యాపారి తన వ్యాపార పనులను పూర్తి చేయవలెను. కాని ధర్మమునకు ప్రాధాన్యతనిచ్చుట తప్పనిసరి.

నమాజుల భద్రత గురించి అల్లాహ్ తఆలా ఇట్లనెను. حٰفِظُوْا عَلَى الصَّلَوٰتِ وَالصَّلٰوةِ الْوُسْطٰى وَقُوْمُوْا لِلّٰهِ قٰنِتِيْنَ (అల్‌బఖరహ్:239) అనగా తమ ప్రార్థనలను విశేషించి మధ్య ప్రార్థనను పాటింపుము. విధేయులపై అల్లాహ్

తఆలా సమక్షమున నిలువుము. ఏదేని నమాజ్ ఏదో ఒక రకంగా భారమని భావించుచున్న వ్యక్తుల గురించి ఈ సూక్తిలో ప్రత్యేకంగా ప్రస్తావించబడెను. రాత్రి పొద్దు పోయేదాక, సోమరితనము వలన ఫజర్ నమాజ్‌లో పాల్గొనుట కష్టమైనచో అతనికి అది మధ్య ప్రార్థన అగును. వ్యాపారికి జుహర్, అసర్ ప్రార్థన కష్టమైనచో అది అతనికి మధ్య ప్రార్థన అగును.

ప్రతిజ్ఞలను పూర్తి చేయాలని, వాటిని పాటించవలెనని పవిత్ర ఖుర్‌ఆన్ మరో ఆదేశమిచ్చెను. ఇందులో అల్లాహ్ తఆలాతో చేసిన ప్రతిజ్ఞలు కూడ గలవు. మానవుల ప్రతిజ్ఞలు కూడ గలవు. అల్లాహ్ తఆలా ప్రతిజ్ఞలనగా అల్లాహ్ తఆలా ధర్మ ప్రతిజ్ఞలు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్‌లో చేరు ప్రతిజ్ఞ గలదు. ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిచ్చు ప్రతిజ్ఞ మనము చేసినాము. ఇస్లాం బోధనను పాటించు ప్రతిజ్ఞ మనము చేసినాము. అల్లాహ్ తఆలా హక్కులు చెల్లించు వైపు శ్రద్ధ కలిగించు ఈ విషయములన్నిటిని పాటించుటకు మనము చేసిన ప్రతిజ్ఞలు గలవు. బైఅత్ నిబంధనలలో ఈ విషయములన్నియు గలవు. ప్రజల హక్కులు కూడ చెల్లించు వైపు ఇవి శ్రద్ధ కలిగించును. ఇటు వైపు మనము దృష్టి సారించవలెను. అల్లాహ్ తఆలా ఇట్లు నుడివెను.

وَاَوْفُوْا بِعَهْدِ اللّٰهِ اِذَا عٰهَدْتُّمْ وَلَا تَنْقُضُوا الْاَيْمَانَ بَعْدَ تَوْكِيْدِهَا وَقَدْ جَعَلْتُمُ اللّٰهَ عَلَيْكُمْ كَفِيْلًا ؕ اِنَّ اللّٰهَ يَعْلَمُ مَا تَفْعَلُوْنَ

(అల్ నహల్:92) అనగా మీరు అల్లాహ్‌తో చేసిన ప్రతిజ్ఞను పూర్తి చేయుము. ప్రమాణములను దృఢపరచిన తరువాత భంగపరచకుము. అల్లాహ్‌ను మీరు సంరక్షకునిగా ఎన్నుకొనితిరి గదా! మీరు చేయునదంతయు అల్లాహ్ నిశ్చయముగా ఎరుగును. మీరు చేసినది రెండు ప్రమాణములని స్పష్టమైన ఆదేశము గలదు. ఒకటి అల్లాహ్ తఆలాతో చేసిన ప్రతిజ్ఞ. ఇది నిశ్చయముగా ఇస్లాం బోధనను పాటించునను ప్రతిజ్ఞ. బైఅత్ ప్రతిజ్ఞ. ఇస్లాంలో ప్రవేశించి, ముస్లిం అనబడి అల్లాహ్ తఆలా ఆదేశములను పాటించుతానని ఈ ప్రతిజ్ఞ గలదు. తెలిపిన రెండవ విషయము ఏమనగా మీరు పరస్పరము చేసిన ప్రతిజ్ఞ, ఒప్పందములను కూడ పూర్తి చేయుము.

ఒక విశ్వాసి తన సర్వ ప్రతిజ్ఞ, ఒప్పందములను పూర్తి చేయవలెనను అంశమును అర్థము చేసుకోవలసిన అవసరమున్నది. ఈ విషయ ప్రాముఖ్యత, వాస్తవమును మనము అర్థము చేసుకున్నచో అన్ని రకాల వివాదములు, మోసములు, ఆరోపణలతో మన సమాజము పవిత్రము కావచ్చును. సంసార జీవితములో కూడ ఏర్పడే సమస్యలు కూడ ఎన్నడు తలెత్తవు. ఎందుకనగా అక్కడ ప్రతిజ్ఞలను భంగపరచడం జరుగును. ప్రాపంచిక ఆశల వలన ఒప్పందములను ఉల్లఘించు, మోసము చేయు, మాట తప్పడం వంటి సమసమ్యలు మనలో కూడ అధికమగుచున్నట్లు నేను గమనించుచున్నాను. యదార్థమేమనగా ఈ విషయముల వలన జమాఅత్ అపనిందకు గురికావడంతో పాటు విశ్వాసములు కూడ ఆవిరైపోవును. ఒప్పందములను మానవుడు భంగపరచినప్పుడు అబద్ధమాడును, అబద్ధము గురించి అల్లాహ్ తఆలా చాలా గట్టి హెచ్చరిక చేసి దాని నుండి దూరముండవలెనని ఆదేశించెను.

అబద్ధము కంటే నీచమైన వస్తువు మరేమియును లేదని నిశ్చయముగా గుర్తుంచుకొనుము. నిజము చెప్పేవారు దాదాపు బంధించబడుదురని ప్రాపంచిక వ్యక్తులందురు. కాని నేనెందుకు దీనిని నమ్మగలను ? నాపై ఏడు వాజ్యములు మోపబడినవి. అల్లాహ్ తఆలా కృపానుసారము ఏ ఒక్కటిలో కూడ ఒక్క అక్షరము కూడ అబద్ధము చెప్పవలసిన అవసరం రాలేదు. ఏ ఒక్కటిలో కూడ అల్లాహ్ తఆలా నన్ను ఓటమికి గురి చేసినట్లు చూపగలరు. అల్లాహ్ తఆలా స్వయముగా సత్యము, నిజమునకు మిత్రుడు. సత్యవంతున్ని అతడెట్లు ఓటమికి గురి చేయగలడు. వాస్తవమేమనగా నిజము చెప్పడంతో శిక్ష పొందువారు సత్యము పలికినందుకు కాదు తమ రహస్య, దాగి యున్న ఇతర నేరముల వలన వారికి శిక్ష లభించును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. وَالْكٰظِمِيْنَ الْغَيْظَ وَالْعَافِيْنَ عَنِ النَّاسِ ؕ (ఆలె ఇమ్రాన్:135) అనగా తమ కోపమును నిగ్రహించుకొనువారు, ఇతరులను క్షమించువారు, సత్కార్యములు చేయువారిని అల్లాహ్ ప్రేమించును అని నిష్టాపరుల ఒక లక్షణము అల్లాహ్ తఆలా తెలిపెను. అఫ్వ్ అనగా తనకు వ్యతిరేకంగా చేయబడిన ఒక నేరమును పూర్తిగా మరచిపోయి ఎవరినైనా క్షమించుట. ఇది అఫ్వ్. నిష్టాపరుడనగా కోపమును నిగ్రహించుకొనడమే కాక క్షమించును కూడ. ఎలా క్షమించాలనగా నాకు వ్యతిరేకంగా ఎవరు నేరము చేసినను దానిని పూర్తిగా మరచిపోవుదును. కోపమును నిగ్రహించు ప్రయోజనములు ఏమిటో వివరించుచు హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. తెలివి, ఉద్రేకములో భయంకరమైన శత్రుత్వము గలదు. ఉద్రేకము, కోపము వచ్చినప్పుడు తెలివి నిలువదు. కాని సహనము, ఓర్పు ఉదాహరణను చూపు వ్యక్తికి ఒక కాంతి ప్రసాధించబడును. దానితో అతని తెలివి, ఆలోచనలో ఒక క్రొత్త కాంతి కలుగును. అనంతరం కాంతితో కాంతి పుట్టును. కోపము, ఉద్రేక సమయమున హృదయము, మెదడులో అంధకారము ఏర్పడును. తద్వారా అంధకారముతో మరింత అంధకారము జన్మించును.

కోపము, వివేకము ఏకము కాలేవు. కోపమునకు బానసైన వ్యక్తి వివేకము, తెలివి మందబారి పోవును. అతనికి ఎప్పుడు ఏ శాఖలో కూడ విజయము, సహాయము అందించబడదు. కోపము అర్ధ పిచ్చితనము. తీవ్ర కోపమునకు గురయ్యే వ్యక్తితో వివేక చెలిమ లాక్కొనబడును. వ్యతిరేకునితో కూడ కోపమునకు గురై మాట్లాడకుము.

హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అపోహ, కోపముతో దూరముండుట మానవునికి అత్యవసరము. అపోహ పడకూడదని పవిత్ర ఖుర్ఆన్‌లో కూడ అల్లాహ్ తఆలా మనకు ఆదేశమిచ్చెను.

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوا اجْتَنِبُوْا كَثِيْرًا مِّنَ الظَّنِّ ۫ اِنَّ بَعْضَ الظَّنِّ اِثْمٌ وَّلَا تَجَسَّسُوْا وَلَا يَغْتَبْ بَّعْضُكُمْ بَعْضًا ؕ
اَيُحِبُّ اَحَدُكُمْ اَنْ يَّاْكُلَ لَحْمَ اَخِيْهِ مَيْتًا فَكَرِهْتُمُوْهُ ؕ وَاتَّقُوا اللّٰهَ ؕ اِنَّ اللّٰهَ تَوَّابٌ رَّحِيْمٌ ﴿۱۳﴾

(అల్ హుజరాత్:13) ఓ విశ్వాసులారా! అపోహ నుండి తరచుగా దూరముండుము. నిశ్చయముగా కొన్ని అపోహలు పాపములు, అన్వేషించకుము. మీలో ఎవరూ మరొకనిపై పరోక్షముగా నిందించరాదు. మీలో ఎవరేని తమ మరణించిన సోదరుని మాంసము తినుటకు ఇష్టపడునా ? కనుక మీరు దీనిని కఠినముగా అసహ్యపడుదురు. అల్లాహ్‌కు భయపడుము. నిశ్చయముగా అల్లాహ్ పశ్చాత్తాపమును స్వీకరించువాడు, పరమ కారుణ్యమూర్తి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ సూక్తిలో దూరముండవలెనని తెలిపిన మొదటి విషయము అపోహ. హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అపోహ ఎటువంటి వ్యాధి, పాపమనగా మానవున్ని అంధునిగా చేసి వినాశన బావులలో పడవేయును. సమస్త పాపములు, దుష్టత్వములు అపోహ నుండి పుట్టునని గుర్తుంచుకొనును. అందుకే అల్లాహ్ తఆలా దీని నుండి హెచ్చరించెను. ఎవరి గురించైనా అపోహ ఏర్పడినచో తరచుగా క్షమాపణలు కోరవలెను.

ఈ సూక్తిలో అల్లాహ్ తఆలా హెచ్చరించిన రెండవ విషయము అన్వేషణ. వెతికి వెతికి ఒకరి దుష్టత్వమును తీయుట లేదా ఒకరి గురించి అన్వేషించుట. ఒకరు ఏదేని విషయము చెప్పుటకు ఇష్టపడనిచో నాకు తెలియాలని తప్పక ప్రయత్నించుట. ఇది పొరపాటు. దీనితో పాపములు పుట్టును. నిందించకూడదని మూడవ ఆదేశము. నిందించుట ఎటువంటి విషయమనగా మీలో ఎవరేని తమ మరణించిన సోదరుని మాంసము తినుటకు ఇష్టపడునా? కనుక మీరు దీనిని కఠినముగా అసహ్యపడుదురు.

రమజాన్‌లో మనము అల్లాహ్ తఆలా నిష్టాపరత అవలంభించుట, అతని సామీప్యము మనకు లభించుట, మన దుఆలు ఆమోదించవలెనని ఆశించినచో ఈ పాపముల నుండి దూరముండుటకు, అల్లాహ్ తఆలా ఆదేశములను పాటించుటకు మనము అధికముగా ప్రయత్నించవలెను. అల్లాహ్ తఆలా ఆదేశములను పాటించుచు, అతని సామీప్యము పొందువారమగుటకు, రమాజాన్ తరువాత కూడ ఈ సత్కార్యములను కొనసాగించువారమగుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! అల్లాహ్ తఆలా నిజమైన ఆరాధకులము, అతని సంపూర్ణ విధేయత అవలంభించువారమగుదుము గాక! (ఆమీన్)

గౌ॥ చౌధ్రి బషీర్ అహ్మద్ గారు హల్క గుల్జార్ హిజ్రి, జిల్లా కరాచి గారి కుమారుడు గౌ॥ చౌధ్రి కలీఖ్ అహ్మద్ గారిని 49 సం॥ల వయసులో అహ్మదియ్యత్ వ్యతిరేకులు 20 జూన్ 2016 తేదీన రాత్రి సుమారు 9:30 గం॥లకు వారి క్లీనిక్‌లో చొరబడి కాల్చి హతమార్చినారని ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా తెలిపిరి. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. వారి సద్గుణములను ప్రస్తావించి నమాజుల తరువాత వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని హుజూర్ ప్రకటించిరి.

BOOK POST (PRINTED MATTER)

To,

............................................................................

............................................................................

............................................................................